ఇలా ఆలోచనల్లోపడి తన ముందు పొంచివున్న ప్రమాదం గురించి, అడ్డాలో ఎదురు చూస్తున్న విక్రమ్ దాదాకి హెచ్చరికలు పంపడం మరిచిపోయినందుకు తనను తానే తిట్టుకున్నాడు. ఇటువంటి వ్యవహారాల్లో ఒక్క క్షణం ఏమరుపాటుగా ఉన్నా దానికి మూల్యంగా కొన్ని ప్రాణాల రూపంలోనూ, కొన్ని కోట్ల రూపాయలు నష్టం రూపంలోనూ చెల్లించవలసి వస్తుందనేది గఫూర్‌కి అనుభవం నేర్పిన పాఠం.

ఇంత అనుభవం ఉండికూడా తాను ఇలాంటి పొరపాటు చేశాడంటే తన మీద తనే కోపం తెచ్చుకున్నాడు గఫూర్.

అదే సమయానికి చింటూ ఎదురుగా ఉన్న స్పీకర్‌లోంచి - ''స్టేషన్ టూ కాలింగ్ - ఇప్పుడే ఒక పోలీస్ జీప్ సిటీ వైపుగా వెళ్ళింది - అది సిటీ వైపుగానే పోతోంది కనుక దానికి భయపడవలసిన పని లేదని భావిస్తున్నాను. అయితే పోలీస్ జీపు వెళ్ళిన ఐదు నిమిషాలకు గఫూర్‌భాయ్ జీప్‌కూడా మమ్మల్ని క్రాస్ చేసింది - ఓవర్'' -

వైర్‌లెస్ ద్వారా వచ్చిన ఇన్‌ఫర్మేషన్ విక్రమ్ దాదాకు అందించాడు చింటూ.

గఫూర్, జీపులోని సెల్యులర్ మోగడంతో దానిని అందుకున్నాడు - ''అన్నా! నేను! విక్రమ్‌ని - నీ ముందు ఏదో పోలీస్ పెట్రోలింగ్ జీపు ఉందని నాకు వార్త అందింది''-

''నాకు తెలుసు - దాని విషయం నేను చూసుకుంటాను'' - అంటూనే సెల్యులర్‌ను ఆఫ్ చేశాడు గఫూర్.

అయితే అప్పటికే ఆలస్యం అయిపోయింది. గఫూర్ జీపు పోలీసు పెట్రోలింగ్ జీపు దగ్గరకు చేరుతుండగానే సి.ఐ అతడికి ఎదురుగా వస్తూ కనిపించాడు.

గఫూర్ జీప్‌ను పోలీస్ జీప్ క్రాస్ చేసిందనే విషయం సెల్యులర్ ఫోన్ ద్వారా వెనకాల వస్తున్న ఎంబాసిడర్ కారులోని గఫూర్ అనుచరులకి తెలియజేయబడింది.

అసలు మొత్తం సరుకంతా ఉన్నది ఎంబాసిడర్ కారులోనే. ముందు వెడుతున్న గఫూర్ కేవలం దారిని క్లియర్ చెయ్యడం మాత్రమే చూసుకుంటాడు.

ఎప్పుడైతే గఫూర్ జీప్‌ను పోలీసులు ఆపు చేశారనే వార్త వచ్చిందో అప్పుడు వెంటనే ఎంబాసిడర్‌ను దారిలోనే ఆపు చేసేశాడు డ్రైవర్. మళ్ళీ ఇన్‌ఫర్మేషన్ వచ్చే వరకూ ముందుకు వెళ్ళకూడదని, అవసరమైతే వెనక్కి తిరిగి బయలుదేరిన చోటికే వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు.

వెనకాల సీటులో కూర్చున్న ముగ్గురిలోనూ ఒకడు కిందకు దిగి పక్కనే ఉన్న పాన్‌షాప్ దగ్గరకు వెళ్ళాడు. ఆ వచ్చినవాడి ముఖ కవళికలను బట్టి సులభంగానే పోల్చుకున్నాడు పాన్‌షాప్ యజమాని.

''ఏం కావాలన్నా?'' - వినయంగా అడిగాడు.

ఎదురుగా ఉన్న గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ పాకెట్ వైపు సైగ చేశాడు. పాకెట్ ఓపెన్ చేసి సిగరెట్ తీసి ఇవ్వబోయాడు కిళ్ళీ షాప్ యజమాని. వెంటనే అతడి కేసి గుడ్లు ఎర్రచేసి ఉరిమి చూస్తూ -

''సింగిల్ సిగరెట్లుకొనే చిల్లర గాడిలా కనిపిస్తున్నానా బే!'' - అనేసరికి చప్పున పేకెట్ అతడి చేతుల్లో పెట్టేశాడు భయంగా.

బయట కేస్‌లో పెట్టి ఉన్న బిస్లరీ సోడాలు ఒక అరడజను రెండు చేతుల్లోనూ ఇరికించుకొని వెళ్ళబోతుండగా

''అన్నా'' - పిలిచాడు పాన్‌షాప్ యజమాని.

బహుశా డబ్బులకోసం పిలుస్తున్నాడేమో అనుకొని - తన తడాఖా ఏంటో చూపించాలనే ఉద్దేశంతో కోపంగా వెనక్కి తిరిగి సీరియస్‌గా చూస్తూ -

''ఏంది బే! ఎందుకు పిలిచావ్'' - కసురుకుంటున్నట్లే అడిగాడు.

''ఏవీలేదన్నా - లోపల ఫ్రిజ్‌లో చల్లటి ఐస్ సోడాలున్నాయి'' అంటూనే - స్వయంగా తనే సోడాలతోపాటు ఓపెనర్‌ను కూడా కారు దగ్గరకు తెచ్చి అందించాడు.

పాన్‌షాప్ యజమాని తన పట్ల చూపిన గౌరవానికి, వినయానికీ పొంగిపోయాడు ఆ రౌడీ.

సాధారణంగా గూండాయిజం చేసే వాళ్ళ మనస్తత్వం చాలా విచిత్రంగా ఉంటుంది. తమ పట్ల కొద్దిగా నిర్లక్ష్యంగా ప్రవర్తించినా అది తమకు పెద్ద అవమానంగా భావించి రెచ్చిపోతారు. తమను ఏమాత్రం గౌరవించినా - ఆ వ్యక్తి పట్ల అభిమానాన్ని అపారంగా కురిపించేస్తారు.

పాన్‌షాప్ యజమానికి ఈ టెక్నిక్ తెలుసు. ఎందుకంటే ప్రతి రోజూ అనేక మందితో వ్యవహరిస్తుండడం వలన ఎవరి మనస్తత్వం ఎలా వుంటుందో అతడికి తెలుసు.

వంద రూపాయల నోటును పాన్‌షాపు అతని చేతుల్లో పెట్టాడు రౌడీ. చిల్లరకోసం పరిగెట్టబోతున్న వాడ్ని వారించి చిల్లర అతడినే ఉంచుకోమనేసరికి -

కృతజ్ఞత ఉట్టి పడేటట్లుగా వంగి మరీ నమస్కారం చేశాడు షాపు అతను.



## అందరి కళ్లూ 'బద్రి' పైనే

'తొలిప్రేమ'తో టీనేజ్ యువత మనసు దోచుకుని 'తమ్ముడు'లో తన పవర్ చూపించి తెలుగు ఇండస్ట్రీ మొత్తాన్నీ తన వైపు దృష్టి మరల్చేలా చేసిన చిరంజీవి తమ్ముడు - పవన్ కళ్యాణ్ 'బద్రి' సినిమాతో మరోసారి అటు అన్నయ్య అభిమానులను, ఇటు తన అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేయనున్నాడు. వరుస హిట్‌లతో దూసుకు పోతున్న పవన్ ఈ 'బద్రి' ద్వారా సరి కొత్త రికార్డులను సృష్టించనున్నాడని ఇండస్ట్రీలోని సినీ పండితులు అంచనాలు వేస్తున్నారు.





షాపతను తెచ్చిచ్చిన గ్లాసులోకి విస్కీపోసి సోడా కలిపి తలో రెండు పెగ్గులూ కొట్టేసరికి -

స్టేషన్ త్రీ నుంచి నో ప్రాబ్లమ్ అన్నట్లుగా సిగ్నల్ అందడంతో కారును మళ్ళీ ముందుకు దూకించాడు. గఫూర్ జీపు తమను క్రాస్ చేసుకుని వేగంగా వెళ్ళిపోవడంతో అందులో ఎవరున్నదీ సరిగ్గా గమనించని స్టేషన్ త్రీ - అందులో వున్నది గఫూరేనని ఉద్దేశంతో నో ప్రాబ్లెమ్ అన్నట్లుగా ఇన్‌ఫర్మేషన్‌ను ఇచ్చేశాడు. అసలు నిజానికి జరిగిందేమిటంటే...

గఫూర్ జీప్ ఆగుతుండగానే సి.ఐ అతడికి నవ్వుతూ ఎదురొచ్చి -

''ఏం గఫూర్ భాయ్! ఏవిటి విశేషాలు?'' - అంటూ పలకరించాడు.

''నీ పిండాకూడు విశేషాలు. అవతల కొంపలు మునుగుతుంటే - పరామర్శించడానికీ, పరాచికాలు ఆడడానికీ నీకు ఇప్పుడే టైం దొరికిందా? పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణ సంకటం అంటే ఇదే - ఈ ఆపరేషన్‌లో ఏమాత్రం అవకతవకలు జరిగినా నాయర్ నిన్నూ నన్నూ కూడా ప్రాణాలతో వదిలిపెట్టడు'' - అందామని నోటి చివరిదాకా వచ్చిన మాటలు - సిఐతో పాటు ఎస్.ఐ కానిస్టేబుల్స్ అక్కడే ఉండి తమను గమనిస్తూ ఉండడంతో - పెదవిదాటి బైటకు రానివ్వకుండా ఆపు చేసుకున్నాడు.

వీళ్ళు ఎదురుగా చూస్తున్నది బహుశా తమకోసం కాదేమో. అందుకే నవ్వుతూ మాట్లాడుతున్నాడు. వచ్చింది ఎవరి కోసమైనా, పొరపాటున తన వాళ్ళు దొరికిపోతే వచ్చే ప్రమాదాన్ని ఊహించుకొని - మనసు కోపంతో రగిలిపోతున్నా పైకిమాత్రం నవ్వుతూ - ''ఏం! సి.ఐ సాబ్ - ఊరి చివర కాపేశారు - ఏదైనా ఉప్పందిందా?'' - పలకరిస్తూనే జీప్‌లోంచి దిగి సి.ఐతో చేతులు కలిపాడు.

మనసులో ఎంతటి భయం, అలజడి ఉన్నా దానిని పైకి మొఖంమీద కనిపించకుండా దాచేసి చిరునవ్వు ముసుగులో ఎంతో నార్మల్‌గా ఉన్నట్లు భ్రమింపచేయగల గొప్ప టెక్నిక్ గఫూర్ దగ్గర ఉంది. చాలా కాలంపాటు సాధన చేయడం ద్వారా సాధించాడు దానిని. ఒక వైపున చిరునవ్వులు రువ్వుతూనే క్షణాల వ్యవధిలో చిచ్చర పిడుగులా శత్రువుల మధ్యకు చొచ్చుకుపోయి, వాళ్ళని దిగ్భ్రాంతిలో ముంచి, వాళ్ళు షాక్‌లో వుండగానే ప్రళయాన్ని సృష్టించేసి తప్పించుకు పోగల నేర్పూ, చురుకుదనం కూడా గఫూర్‌లో కావలసినంత ఉంది.

ఏదైనా ప్రతి చర్య చేసే ముందు పరిస్థితిని సమీక్షించుకోవడం అతడికి అలవాటు. అంత హఠాత్తుగా మార్గమధ్యంలో పోలీసులు నిఘా వేయడం వెనకాల తనకు ప్రమాదం కలిగించే ఎత్తుగడ ఏదైనా ఉందేమో కనుక్కోవడానికి వాళ్ళ ముఖాలను నిశితంగా పరిశీలించాడు.

అటువంటి ప్రమాద సూచనలేవీ కనిపించకపోయేసరికి మానసికంగా కుదుటపడ్డాడు.

''ఏదో పెద్ద విశేషమే ఉండి ఉంటుంది. లేకపోతే మొత్తం స్టేషనంతా కదిలిరాదు. ఏవిటి సార్ - ఏదైనా ప్రాబ్లమా?''

''ఏం లేదు గఫూర్. ఇక్కడ పక్కనే ఉన్న బొస్తలగూడెంలో ఎవరో పెళ్ళిచేసుకుంటుంటే...''

''బొస్తగూడెంలో పెళ్ళికి పోలీసు డిపార్ట్‌మెంట్‌ని ఆహ్వానించేటంత పెద్ద మనిషి ఎవరుసార్?'' -

''అబ్బే! మేం పెళ్ళికోసం, పెళ్ళి చూడ్డానికి వెళ్ళలేదు గఫూర్''

'అవున్లే! శుభమా అని పెళ్ళి చేసుకుంటూ - నీలాంటి లత్కోరు నాయాళ్ళని పిలిచేటంత దరిద్రులెవరుంటారీ ఊళ్ళో' - మనసులోనే అనుకున్నాడు.

'పెళ్ళికోసం కాకుంటే మరెందుకో' - ఎంత దాచుదామని ప్రయత్నించినా గఫూర్ కంఠంలో కొద్దిగా వెటకారపు ధ్వని తొంగి చూసింది.

''అక్కడ పెళ్ళి చూడ్డానికి వచ్చిన కొందరు యూస్‌లెస్ ఫెలోస్ పీకలదాకా తాగి తన్నుకు ఛస్తున్నారని ఇన్‌ఫర్మేషన్ వస్తే వెళ్ళాం. తీరా మేం వెళ్ళేసరికి వాళ్ళల్లో వాళ్ళు రాజీపడిపోయి సర్దుబాట్లు చేసేసుకుని చెట్టాపట్టాలేసుకొని విందు భోజనాలు లాగిస్తున్నారు. మేం వెళ్ళేసరికే గొడవ సద్దుమణిగి శాంతి భద్రతలు చోటుచేసుకోడంతో వెనక్కి తిరిగి బయలుదేరాం'' -

''తెలివైన వాళ్ళు కాబట్టే - తోడేళ్ళల్లాంటి మీ చేతుల్లో పడకుండా వాళ్ళే సర్దుబాటు చేసేసుకున్నారు. మరి పోయేవాళ్ళు పోక దారి మధ్యలో ఇలా జిడ్డు మొహాలతో ఛండాలంగా నిలబడి చావడం ఎందుకో'' - మనసులోనే విసుక్కుని పళ్ళు నూరాడు.

''మరి ఇలా! దారి మధ్యలో ఆగారెందుకు?'' -

''అదే కదయ్యా! చెబుతున్నది. ఇంతవరకూ బాగానే వచ్చిన జీపు ఎందుకోమరి హఠాత్తుగా, అర్థంతరంగా మధ్యదారిలోకి వచ్చాక చెడిపోయింది. నువ్వు ఏమీ అనుకోకపోతే సిటీవరకూ లిఫ్ట్ ఇవ్వగలవా?'' -

ఒక ప్రక్క సరుకుతో నిండిన బండిని వెనకాల పెట్టుకుని క్షణక్షణ గండంగా తన పరిస్థితి ఉంటే వీళ్ళు తనని సిటీవరకూ లిఫ్ట్ ఇమ్మంటున్నారు. ఇప్పుడు వీళ్ళందరినీ తనతోపాటు జీపులో ఎక్కించుకుంటే విక్రమ్ దాదాని కాని, చింటూని కాని, వెనకాల ఎంబాసిడర్‌లో వాళ్ళని కానీ కాంటాక్ట్ చెయ్యడం కష్టం.

వీళ్ళు ఈ రోజు తమ సరుకుని పట్టుకోడానికి రాలేదనే విషయం తెలియగానే అతడి మనసు కుదుటపడింది. ఇప్పుడు ఎదురైన సమస్యని ఎలా పరిష్కరించాలా అని ఒక్క క్షణం ఆలోచించాడు. అతడికి వెంటనే అయిడియా తట్టింది.

ప్రతిసారీ సరుకు రవాణా చేసేటప్పుడు వాళ్ళకి ఏ ఇబ్బందీ ఎదురు కాలేదు. ఎవరికి ఇవ్వాల్సిన వాటా వాళ్ళకి సక్రమంగా ఇచ్చేస్తూ ఉండడం వల్ల సులభంగా పని జరిగిపోతోంది. ఇప్పుడు కూడా అదే విధంగా జరుగుతుందనే ఆలోచనలో ఉన్నారు ఎంబాసిడర్ కారులోని వాళ్ళు. ఎక్కడా అడ్డూ, ఆపూ ఉండదనే మొండి ధైర్యం కలిగి ఉండడం వల్ల మరో రెండు పెగ్గులు ఎక్కువగానే పుచ్చుకున్నారు. కడుపులోకి చేరిన విస్కీ తన ప్రభావాన్ని కొద్ది కొద్దిగా చూపడం ప్రారంభించింది.

**(ఇంకా వుంది)**

కథ

# ''స... స... స... స...''

ఎ.ఎస్.సుజాత



గ్రాఫిక్స్ భాస్కర్

ఆంధ్రా నుండి హైదరాబాద్ వచ్చిన ప్రతి వాళ్ళకీ ఇక్కడి వాతావరణం అలవాటు కావాలంటే కొంతకాలం పట్టడం సహజం. వాతావరణం అంటే వెదర్ కాదు. అట్మాస్ఫియరు.

సెనగ గింజలంతేసి దోమలూ, చాదర్‌ఘాట్ బ్రిడ్జి మీద నుండో, లేక పోతే టాంక్‌బండ్ మీదనుండో పోతుంటే వచ్చే పరిమళం, బస్టాప్‌లో తప్ప ఎక్కడైనా ఆగే సిటీ బస్సులూ, ఎక్కడ బడితే అక్కడ ట్రాఫిక్ జాము కావటం, ఆ జాము కాస్తా 'జ్యాస్'గా మారాలంటే (పచ్చబడాలంటే అని నా ఉద్దేశం) గంటలకొద్దీ టైము పట్టడం ఇవన్నీ వంట బట్టించుకోవాలంటే కాస్త టైం పడుతుంది మరి.

ఇంకా చెప్పాలంటే, తెలుగు వచ్చినా ఇంగ్లీషులో మాట్లాడాలని కక్కుర్తిపడే తెలుగువాళ్ళూ, చిల్లర ఇవ్వని కండక్టరూ, వాళ్ళ యాసని పల్లెత్తుమాట ఏదైనా అంటామేమో తగాదాడేద్దామని చూసే తెలంగాణా జనం, అక్కా, అమ్మ అంటూ కాళ్ళమీద పడిపోయి గట్టిగా పట్టేసుకుని నలుగురిలో ఇబ్బందిపెట్టి ఖచ్చితంగా పైసలు (సారీ ... రూపాయికి తక్కువిస్తే మొహాన విసిరే వాళ్ళున్నారు హెచ్‌వైడిలో) వసూలు చేసే యాచక వనితలు, చారణాలు, బారణాలు, ఆఠణాలు, మూసీలో ఆరోగ్యంగా పెరిగే హైబ్రీడ్ ఆకుకూరలు ఇవన్నీ కూడా అలవాటు కావాలంటే కొంతకాలం పడుతుంది. ఏమంటారు?

కానీ ... నీటన్నిటికంటే మీకు తొందరగా అలవాటైపోయే దొకటుంది. అదీ మీరు ఉద్యోగం గట్రా చేస్తుంటే ఇంకా తొందరగా అలవాటైపోతుంది. అదేమిటో చెప్పనా ... అదేనండీ ... ''స్‌స్‌స ...స''

ఇదేమిటని బెదిరిపోకండి. చదువుతుంటే ఏదోలా వుంది కానీ నిత్యజీవితంలో మీరెన్నిసార్లు వినట్లేదు చెప్పండి. నేను మీలాగే మొదట్లో ఈ శబ్దం అంతరార్థం ఏమిటా అని ఆలోచించాను. కొన్నిసార్లు అపార్థం కూడా చేసుకున్నాను.